# బడీబీ


కథ

**మా ఊరు సముద్రతీర ప్రాంత చిన్న పట్టణం. ఊరి చుట్టూ ఇసుక దిబ్బలు, తాటిచెట్లూ, మొగలిపొదలు, జీడిమామిడి చెట్లూ, సరుగుడు తోపులు అందంగా వుంటాయి. కుందేరు ఊరిమధ్యగా జీవనదిలా ఒకప్పుడు ప్రవహిస్తుండేది.**

తోటవారి పాలెం దగ్గర చీలిన కాలువ మోటుపల్లి దగ్గర సముద్రంలో కలుస్తుంది. కుందేరు పరీవాహక ప్రాంతమంతా పశువుల మేత మడులతో పరుచుకున్న పచ్చిక తివాచీలా వుంటుంది. పచ్చటి కాన్వాసుకు రెల్లు దుబ్బులు తెల్లబార్డర్‌లా వుంటుంది. ఎత్తుగా ఎదిగిన రెల్లు మధ్య చిత్రవిచిత్ర వెండిమబ్బులు వెలుగుల సంధ్యాసమయ కాంతులు ఆకాశం నిండా పులుముకున్న సౌందర్యం ఎంత చూసినా తనివి తీరదు. అక్కడి గాలి వొంటిని తాకి సందె వెలుగులో అంతటా వ్యాపిస్తుంటే చీకటి కాంతులు చిత్రంగా వుంటాయి. గాలి రవళులు, గాలి లాలనలు చెవులలో చిత్రమైన ఊసులు చెప్తుంటాయి. వీటన్నిటిలోంచి అద్వైతించిన సృష్టి కుందేరు పచ్చిక చెక్కిళ్ళు.

సూర్యోదయ, సూర్యాస్తమయాలు కుందేరు ప్రాంతంలో నేత్రానందాన్ని కలిగిస్తాయి.

బడీబీ రోజూ సాయంత్రం కుందేరు వెళ్తుంది. సంధ్యా సమయంలో గట్టుమీద గరికె పీకల్ని గుప్పెడు తీసుకొని యింటికి వెళ్తుంది. నేను హాస్పిటల్ వెళ్ళే సమయం ఆమె గరికకోసం వచ్చే సమయం ఒక్కటే కావటం యాదృచ్ఛికం.



డా॥ ధేనువకొండ శ్రీరామమూర్తి

బక్క పలుచగా విద్యుద్దయస్కాంత కళ్ళతో, కాస్త ముడతలు పడ్డ శరీరం బడీబీది. ముగ్గురు కూతుళ్ళు, ముగ్గురు అల్లుళ్ళతో మనుములు, మనుమరాళ్ళతో ఒకే కుటుంబం. ఇమాంబీబీ అసలు పేరు. ఆ ప్రాంత వాసులంతా ఆమెను 'బడీబీ' అని పిలుస్తుంటారు. మసీదు సెంటరులో కూరగాయల దుకాణం వుంది. సాయంత్రం మాత్రం సముద్రం చేపలు, చెరువు చేపలు. అల్లుళ్ళు వ్యాపారం చేస్తుంటారు. ఇంట్లో అందరూ చిన్నా, చితక పనులు చేస్తుంటారు. డబ్బు అజమాయిషీ అంతా ఆమె చూస్తుంది.

జక్కావారి వీధిలో పురాతన వినాయక దేవాలయం వుంది. ప్రతిరోజూ కుందేరులో తెచ్చిన గరికె పీకలతో మాల చేసి పూజారికి అందిస్తుంది. ఆయన ఉదయాన్నే పూలతో స్వామికి అలంకరింపజేస్తారు. ఆమెకు వాళ్ళ నానమ్మ ఆదేశంగా చిన్నప్పటినుంచీ చేస్తోంది. ఇళ్ళ వద్దనే పురుళ్ళు పోయడం ఆమె ప్రత్యేకత. ప్రసవ సమయంలో 'బడీబీ' దగ్గరే వుండాలని అందరూ కోరుకుంటుంటారు. ఆమె హస్తవాసిని గొప్పగా గౌరవిస్తారు. ప్రసవం అవుతుందో కాదో, ఎంత సమయంలో అవుతుందో నడుము చుట్టూ చేతులు పోనిచ్చి పొట్టను తడిమి ఇట్టే చెప్పేస్తుంది. ఆసుపత్రికి తీసుకెళ్ళండని చెప్తే కాన్పు కష్టమవుతుందని అనుకోవాలి. తాత్సారం చేయకుండా వెంటనే చెప్పేస్తుంది. అప్పటి సదానందరావు డాక్టరుకు, సాల్మను మరదలుకు, ఫ్రీజరమ్మకు, ఇప్పటి డాక్టరు మాణిక్యమ్మకు బడీబీ అంటే గొప్ప గౌరవం. ఆమెను ఆపరేషన్ థియేటరు లోనికి కూడా రానిచ్చేవారు.

కాన్పు వుంటే కూరగాయలు దుకాణం కూతురికి అప్పగించి వెళ్ళేది. ఏది ఏమైనా గరికెమాల తయారుచేయటం మరిచేది కాదు. మనవడు, మనవరాలు ఎవరో ఒకర్ని తీసుకొని ఆసుపత్రికి అడపాదడపా వస్తుండేది. ఆసుపత్రి నుంచి వెళుతూ గుడిదగ్గర ఆగి పిల్లలకు విభూతి రాయించుకువెళ్తుంది.

ఉదయాన యింటిదగ్గర, సర్పి (హెర్పస్) చల్ది వ్యాధులకు మంత్రం వేస్తుంది. మంత్రానికి దూరప్రాంతాల నుంచి వచ్చేవారు. 'దవా, దువా' సూత్రం వర్తిస్తుంది. ఆమె ఎప్పుడూ ఆరోగ్యంగా వుండేది. తన గురించి ఆలోచించే వ్యవధి వుండేది కాదు. తనను మరిచిపోయేంత పనిని ఎప్పుడూ ఏర్పరుచుకొనేది. కుటుంబానికి సేవ, చుట్టూ వుండేవారికి ఉపకారం బడీబీ నిత్య కార్యక్రమాలు.

ఎంతో భక్తిశ్రద్ధలతో సూరాలను మననం చేసుకుంటుంది. ప్రతి సంవత్సరం రంజాన్ మాసంలో ఉపవాసాలు వుండేది. పండగకు రకరకాల సేమ్యాలు ఆసుపత్రికి తెచ్చి ఇస్తుంది. వద్దంటే వినేది కాదు. "ప్రేమతో ఇచ్చేవాటిని కాదనకు బేటా" అనేది. తినిపించి వెళ్ళేది.

** ** **

క్లినిక్ బాగా బిజీగా వుంది, విషజ్వరాలు ఎక్కువగా వున్నాయి. ఇంట్లో శుక్రవారం పూజ వుండడంతో హాస్పిటల్‌కి రావటం కాస్త ఆలస్యం అయింది. క్లినిక్ నిండా చిన్న పిల్లలు 'గీ-బా' అంటూ ఏడుస్తున్నారు. కొందరు ఇంజక్షన్ల నొప్పికి, కొందరు ఇంజక్షను చేస్తారనే భయంతో ఏడుపులు లంకించుకుంటున్నారు. గుక్క పట్టి ఏడుస్తున్న ఒక బిడ్డను వాళ్ళ నాన్న వేగంగా లోనికి తీసుకవచ్చి "తోటవారిపాలెం తిరుణాలకు వెళ్ళాం బాబు, అక్కడ ఏడుపు లంకించుకున్నాడు, ఇక్కడికి వచ్చాం. మీరు రాలేదు. ఆ పక్క ఆసుపత్రిలో నెప్పికి ఇంజీషను చేశారు. ఏడుపు తగ్గలేదు. ఎక్కువ అయింది" సంజాయిషీగా బిడ్డ తండ్రి వివరిస్తున్నాడు.

బల్ల మీద పడుకోబెట్టి చూశాను పొట్ట మెత్తగానే వుంది, ఉబ్బరం లేదు.

"పాలు తాగుతున్నాడా? తాగించి ఎంత సేపయింది?"

"నేను వద్దనేకొద్ది తిరుణాలకు వెళ్ళాలని ఆ లం..... పేచీ పెట్టింది. అక్కడకు వెళ్ళాక ఇది ఏడుపు లంకించుకుంది. ఇచ్చిందో లేదో ఆ సంగతే గ్నాపకం లేదు బాబు".

అక్కడ వున్న బడీబీ లోనికి వచ్చింది. బిడ్డను చేతుల్లోకి తీసుకుంది.

"పిల్ల అమ్మేది? ఎక్కడా?" ప్రశ్నించింది.

"ఎనకాల వస్తోంది. నేను లగెత్తుకొచ్చానమ్మా".


తేనె సీసా తెప్పించి తన చూపుడు వేలు ముంచి బిడ్డ నోట్లో

ఉంచింది. తేనె రుచికి ఏడుపు ఆపి మరలా ఏడుపు మొదలెట్టింది.

కర్టెను పక్కకు వెళ్ళి శుష్క స్తనానికి తేనె రాసి బిడ్డనోట్లో వుంచింది. బిడ్డ ఏడుపు ఆపింది. అంతలో బిడ్డ తల్లి వచ్చింది. స్తన్యాన్ని ఇప్పించింది. బిడ్డ ఏడుపు ఆపి సొమ్మసిల్లి నిద్రపోయింది.

'బడీబీ'లో వుండే మాతృత్వ ఛాయ తత్కాల నిర్ణయం అందరినీ ఆశ్చర్యంలో ముంచింది.

ఇంట్లోని చిన్న ఆడపిల్లల్ని మసీదులో ముల్లా ఉర్దూ స్కూలుకు పంపుతుంది. మగపిల్లల్ని సర్కారు బడికి పంపుతుంది. మనవలు పెద్ద చదువులు చదవాలని కోరుకొనేది.



బీడీలు చుట్టే కార్యక్రమం అక్కడి ఇళ్ళలో వుంది. వేటపాలెం బాణం బీడీ వారికి ఖాళీ సమయాల్లో బీడీలు చుట్టి వుంచితే ఏజంట్ వచ్చి లెక్కకట్టి తీసుకవెళ్తాడు. వారం వారం బట్వాడా వుంటుంది. ఆ డబ్బుల్ని, పిల్లల పెళ్ళి ఖర్చులకోసం వేరేగా వుంచుతుంది.

బడీబీ ఇంటి పక్కనే సందానీ బేగం యిల్లు. సత్తారుభాయి వెల్డింగ్ షాపు వుంది. ముగ్గురు పిల్లలలో యిద్దరు చదువు ఆపు చేసుకొని తండ్రికి సహాయంగా వెల్డింగ్ షాపులో వుంటున్నారు.

చిన్నవాడు సలావుద్దీన్ 'బడీబీ' పెంపకం. స్కూలు నుండి వచ్చాక పాలు తాగి ఆమెను అనుసరించి వుంటాడు. ఇంట్లో వాళ్ళ బావ సౌదీ నుంచి తెచ్చిన కలర్ టీవి వున్నా, బడీబీ దగ్గర వుంటాడు. ఆమె చదివే సూరాలు శ్రద్ధగా ఆలకిస్తాడు.

'బడీబీ' మనుమడు నూర్‌బాషా స్కూల్ నుంచి రాగానే పాలు తాగి సందనా బేగం ఇంట్లో టీవి చూసేందుకు వెళ్ళేవాడు. చూసి చూసి పొద్దుపోయి వస్తుంటాడు.

** ** **

"దాదీమా"

"ఏంది బేటా"

"నాకు కాలా కపడా" కావాలి, ఇంట్లో వుంటే ఇవ్వు. లేకపోతే డబ్బులు ఇవ్వు".

"ఎందుకురా" విసుగ్గా అంది.

"రేపు బ్లాక్ ఫ్రైడే అందరూ ఇళ్ళపై నల్లజెండాలు ఎగరేయాలి. రేపు స్కూలు బంద్, జులూస్ వుంది"

"ఏమైందిరా?"

"మసీదు పడదోశారు నీకు తెలీదా?"

వాకిట్లో గేటు చప్పుడయింది. గుడి పూజారి ఆయన భార్య "బూబమ్మా!" అంటూ లోపలికి వచ్చారు.

"రండి పంతులుగారు" అంటూ మంచం చూపించి కూర్చోమంది.

భార్య వీపును చూపిస్తూ "సర్పి లేచిందమ్మా! బాధపడుతోంది, ఒకటే మంటలు మందులు ఇప్పించా, నీ మంత్రం పారాలిగా" అంటూ మంచంమీద కూర్చున్నారు.

"అరే చిన్నా, వేప మండ కొట్టకరా, తొందరగా" అని చిన్నాడి భుజం తట్టింది.

"నేను తేను" నిర్ద్వంద్వంగా మొండికేశాడు.

"ఏమైందిరా? జల్దీ పోయి తే"

"వీళ్ళు మసీదు పడతోశారు నేను తేను"

"ఏ మసీదు, ఎవరు పడేశారు, ఎవరు చెప్పారు నీకిదంతా?"

టీవీలో చూపించారు, నిన్న ఇవ్వాళ అదే సంగతి చెప్తున్నారు. నేను నల్లజండా ఎగరేయాలి.

ఆమె విస్తుపోయింది.

'ఏలెడంత పిల్లోడు ఎదురు తిరిగాడు" అని అందరూ అవాక్కయ్యారు.

పక్కింటి సలావుద్దీన్ చేతిలో దువ్వెనతో "అమ్మ తల దువ్వించుకొని రమ్మంది" అంటూ వచ్చాడు. బడీబీ తల దువ్వింది.

"బేటా మంత్రానికి వేపమండ కావాలి తీసుకురా" అంది.

వెంటనే వెళ్ళి తీసుకువచ్చి ఇచ్చి వెళ్ళాడు.

మనస్సును ప్రశాంతం చేసుకొని బావి దగ్గరకు వెళ్ళి కాళ్ళు,

## అర్థవంతమైన కథ

జూన్ 12 వార్త ఆదివారంలో వచ్చిన డా. కె.ఎన్. మల్లీశ్వరిగారి కథ, 'మమ్మల్నీ మారనివ్వండి' చదివాను. ఈ రోజుల్లో వస్తున్న కథల్లో అధిక శాతం 'అయోమయం' కథలు. ఇటువంటి పరిస్థితుల్లో వచ్చిన ఈ కథ అర్థవంతంగా వుంది. 'మా ఇంట్లో మగాళ్ళు అన్నం తిన్న పళ్ళెం తీయడం నాకు నచ్చదు బాబూ' అనీ, 'మగాళ్ళు వంటింట్లోకి వస్తే నాకు చాలా ఎబ్బెట్టుగా వుంటుంది బాబూ' అనీ వాపోయే స్త్రీరత్నాలని ఎంతోమందిని ఎరుగుదుము. అలాగే అతి తెలివిగల కొందరు స్త్రీలు బయట పని పురుషుల్తో సమానంగా చెయ్యకుండా, పురుషుని చేత కొంత ఇంటి పని చేయిస్తూ, తాము కాస్త చేస్తూ, ఆత్మగౌరవం లేకుండా బతకడం కూడా తెలుసు. అయితే అందరు స్త్రీలూ ఇలాగే వున్నారనీ, పురుషులందరూ మహా ఉత్తములనీ కూడా కాదు. ఇక్కడ మారుతామన్న పురుషుల గురించీ, వారిని మారనీయని స్త్రీల గురించీ మాత్రమే మాట్లాడుతున్నాము. నిజంగా చక్కటి కథ.

ఈ కథ చదివి ఒక స్త్రీ రత్నం ఒక వెబ్ సైటులో, 'భర్తా, భార్యా తమ ఆర్థిక పరిస్థితి గురించి అర్థం చేసుకుని, సంతృప్తి చెంది వుంటే, భార్య ఇంట్లోనే వుండటం అంగీకారమైనదని అనుకుంటున్నాను' అని రాశారు. ఇంకొంత మంది స్త్రీ రత్నాలకి ఈ కథ డ్రమెటిక్‌గా వుండి, బోర్ కొట్టిందిట. వారికున్న చైతన్యస్థాయిని బట్టి ఇటువంటి కథలు వారికి ఆ విధంగా అర్థం అవుతాయి.

ఎటొచ్చీ ఈ కథలో ఒక లోపం వుంది. కథలో ఒక స్త్రీ పాత్ర మేడ మీద నించీ కథానాయకుడి వేపు చూస్తూ వుంటుంది. అప్పుడు అతను, 'నేనూ, అమ్మా ఆమెతో మాట్లాడుతాం' అని అంటాడు. అలాంటి సందర్భాలు కూడా వుంటాయనుకుంటే, ఈ సందర్భానికి అది వర్తించదు. ఆ అబ్బాయీ, అతని తల్లీ, ఆ అమ్మాయి దగ్గరకి వెళ్ళి, 'అది తప్పు' అని చెప్తారా? ఈ విషయం చాలా అసంబద్ధంగా వుంది. ఎవరినో మార్చేస్తాం, ఎవరినో వుద్ధరిస్తాం, ఎవరికో ధైర్యసాహసాలిచ్చేస్తాం అని అనుకోవడం అమాయకత్వం. పురుషులు వ్యభిచారం వేపు వెళ్ళకూడదని చెప్పాలని రచయిత్రి అభిప్రాయం. కానీ చెప్పిన పద్ధతే కుదరలేదు. మొత్తం మీద మంచి విషయం వున్న కథ.

– జె.యు.బి.వి.ప్రసాద్

చేతులు కడుక్కొని మంత్రం పూర్తి చేసింది.

"మసీదు పడేశిన రోజుట బాబు, మా బుడ్డోనికి కోపం వచ్చింది".

"అవును బూబమ్మా మేం తీర్థయాత్రకు వెళ్దామనుకుంటున్నాం. గొడవ గొడవగా చెప్పుకుంటున్నారు. మాయదారి గొడవలు, మొగాలు మొగాలు చూసుకోవాలి మనం, ఎక్కడి గొడవలో ఏం పాడో పాత రోజుల్లో నే బాగుండేది ఎక్కడ ఏం జరుగుతుందో తెలిసేది కాదు.

తనలో మానసిక హింస మొదలయింది. ప్రపంచంలోని సంగతులన్ని టీవి చెప్పున్నది. ఎక్కడో జరిగిన విషయాలన్ని మన యింట్లోవి లాగానే వుంటున్నాయి. పిల్లలిద్దరిలో ఎంత వైవిధ్యం! యింట్లోనే టీవి వున్నా నిరాసక్తంగా సలావుద్దీన్- పక్కింట్లో టీవీ చూస్తూ విషయ ప్రభావితమై విప్లవించేవాడు మనవడు నూర్‌భాషా.

ఇంతకుముందు దేశీయ పరదేశీయగానే వుండేది. కాలం చూస్తుంటే ఎన్నో మార్పులు వేగంగా, అనూహ్యంగా జరుగుతున్నాయి. కాలం తీరు విచిత్రంగా మారిపోయింది. మనుషులమధ్య అనుమానం గోడలు పెద్దవిగా పెరిగిపోతున్నాయి. ఉదయమే చీకటిగా మారింది. చీకటి చికాకు కలిగించింది.

వెలుగులు వెతుక్కొనే చూపులు కావాలి. మనసులోని వెలుగులు భవితకు మార్గదర్శక మౌతాయి. దార్శనికత బడీబీ లో వుంది.

జెండా ఎగరేయడానికి నల్లగుడ్డ జెండా చేసి మనవడికి ఇచ్చింది. హుషారుగా ఎగరేశాడు. వాడికళ్ళు వెలిగిపోయాయి.

దగ్గరకు తీసుకొని తల నిమిరింది.

"దీదిమా కోపం రాలేదా? కొడతావనుకున్నా!"

చిన్న కోరికకు కోపమెందుకురా చిన్నా? జరిగే తప్పులు పోయేవి కావు. మనిషికి మంచి బతుకుతెరువు కావాలి బేటా!"

సూరాలు చదువుతూ వాటి అర్థం విడమరిచి చెప్పింది. ఇతరులకు సహాయం చేయడంలోనే ఆనందం వుంటుందని చెప్పింది.

పక్కింటి ఆమె తన కోడలికి పురిటి నొప్పులు వస్తున్నాయంటూ పరుగెత్తుకొని ఆయాసపడుతూ వచ్చింది.

కాన్పు సంచీ అందుకొంది.

వెంటనే బయల్దేరింది.

మనవడు నూర్‌భాషా సాయంగా వస్తానన్నాడు. సంచీ అందుకున్నాడు. సహాయం చేస్తున్నందుకు నూర్‌భాషాకు ఆనందం కలిగింది.

# చీలిన చెట్టు ఏకమైతే...?

నిర్విరామ నిరంతర జీవితానుభవాలతో
నిటారుగా ఎదిగిన ఆయుధమతడు
యుగాలుగా
ప్రకృతిని లొంగదీసుకునే తండ్లాట
ప్రళయాల నెదుర్కునే సుదీర్ఘ ప్రయాణం
ప్రమాదాలను చిరునవ్వుతో స్వాగతించే సాహసం-
లోకం ఆకలి తీర్చడానికి
తన ఆకలిని ఫణంగా పెట్టినవాడు
పల్లె దాహానికి
చెట్టుగుండెను ఒంపినవాడు
ఎండిన డొక్కల వైపు
పండిన ముంజలను విసిరినవాడు
అయితే...
ప్రకృతిని జయించిన ఈ సాహసి
వికృత రాజకీయాలతో
నిలువునా చీలిపోయాడు
ఒకే జీవన పోరాటాన్ని
పలు విధాలుగా కొనసాగిస్తున్నాడు
ఒకే నినాదాన్ని
విభిన్న గొంతులుగా పలుకుతున్నాడు-
మరి
చీలిన చెట్టు ఏకమైతే...?
తెగిన నినాదం జతకూడితే..??

- ఎస్వీ సత్యనారాయణ

